

కుక్కల దాడిలో గొర్రెలు మృతి

నర్సాపూర్ మండలం తుల్జారాంపేట గిరిజన తండాలో వీధి కుక్కల దాడిలో పాకలో ఉంచిన 20 గొర్రెలు మృతి చెందాయి. 15 గొర్రెలు గాయపడ్డాయి.

8లో



భేతాళస్వామి జాతరకు వేళాయె


మెదక్ జిల్లాలో ఏడుపాయల జాతర తర్వాత ప్రారంభం కానున్న అల్లాదుర్గం భేతాళ స్వామి జాతరకు చకచకా ఏర్పాట్లు చేస్తున్నారు.

8లో

ఇద్దరికి పాజిటివ్



పటాన్‌చెరు టౌన్: పటాన్ చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారం 22 మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించగా అందులో ఇద్దరికి పాజిటివ్ వచ్చినట్లు టెస్టుల నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. అదేవిధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు నిర్వహించలేదని పేర్కొన్నారు



న్యూస్‌రీల్

నేడు జహీరాబాద్‌కు మంత్రి హరీశ్‌రావు

జహీరాబాద్: ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ఈనెల 6వ తేదీన నియోజకవర్గంలో పర్యటిస్తున్నట్లు ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు తెలిపారు. ఉదయం 11.45 గంటలకు మొగుడంపల్లి మండలంలోని ధనాసిరి గ్రామంలో నూతనంగా నిర్మించిన 33/11కేవీ సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. అనంతరం అదే గ్రామంలో నిర్వహించనున్న బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. మధ్యాహ్నం 3.30 గంటలకు ఝరాసంగం మండలంలోని ఎల్గోయి గ్రామంలో నూతనంగా నిర్మించిన 33/11కేవీ సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తారు. సాయంత్రం 4.30 గంటలకు జహీరాబాద్ పట్టణంలోని పీవీఆర్ గార్డెన్ ఫంక్షన్ హాలులో నిర్వహించనున్న కార్యక్రమంలో లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్ చెక్కుల పంపిణీ, స్వయం సహాయక సంఘాలకు లింకేజీ చెక్కులను అందజేస్తారని, 6 గంటలకు బాగారెడ్డి స్టేడియంలో నిర్వహించనున్న ఇఫ్తార్ విందులో పాల్గొంటారని తెలిపారు.

బసవ జయంతిని ఘనంగా నిర్వహించాలి



సమావేశమైన నాయకులు

కొండాపూర్(సంగారెడ్డి): జిల్లా వ్యాప్తంగా బసవ జయంతిని ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర వీర శైవ లింగాయత్, లింగ బలిజ జిల్లా అధ్యక్షుడు పృథ్వీరాజ్ అన్నారు. సంగారెడ్డిలో వీరశైవ లింగాయత్, లింగబలిజ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఈ నెల 23వ తేదీన విశ్వ గురు బసవేశ్వర మహాత్మ జయంతి వేడుకలను పురస్కరించుకొని వేడుకల నిర్వహణపై కార్యాచరణ రూపొందించారు. సంగారెడ్డి పెద్దమటం నుంచి బైపాస్‌లో గల బసవేశ్వర విగ్రహం వరకు ర్యాలీ ఉంటుందని, అనంతరం విశ్వగురు బసవేశ్వరునికి పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. కలెక్టరేట్‌లో ప్రభుత్వ అధికార కార్యక్రమాలకు హాజరు, బసవేశ్వరుని చరిత్ర, బోధనలు, భవితరాలకు అందించే విధంగా ప్రముఖులతో ప్రసంగాలు, అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో పేదలకు అన్న ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు.

ప్రమోషన్లు, బదిలీలు పక్కాగా చేపట్టాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఉపాధ్యాయుల ప్రమోషన్, బదిలీల ప్రక్రియ పక్కాగా చేపట్టాలని యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి అన్నారు. జిల్లా అధ్యక్షుడు షేక్ వలీ అహ్మద్ అధ్యక్షతన బుధవారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎనిమిదేళ్లుగా ప్రమోషన్లు, నాలుగేళ్లుగా బదిలీలు లేక ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నాఉ. అటు పాఠశాలలో సబ్జెక్టు టీచర్ల కొరత ఏర్పడిందని అన్నారు. ప్రభుత్వం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ప్రమోషన్లు, బదిలీలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యురాలు ప్రభావతి, జిల్లా ప్రధాన కార్యదర్శి తప్పెట్ల యాదగిరి, జిల్లా ఉపాధ్యక్షుడు చిర్ర యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమలుపై నజర్

- తరచూ అధికారుల సమీక్షలు
- సంబంధిత శాఖలకు కలెక్టర్ ఆదేశాలు



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ శరత్(ఫైల్)

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. ప్రధానంగా సంక్షేమ పథకాల అమలు తీరును ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు సమీక్షిస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఈ పథకాల అమలు తీరుపై ప్రత్యేక దృష్టి సారించారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

- రెండో విడత గొర్రెల పంపిణీ చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు అర్హులైన లబ్ధిదారులకు గొర్రెల యూనిట్లను మంజూరు చేసేందుకు పశుసంవర్ధకశాఖ సన్నాహాలు చేస్తోంది. గొర్రెల కొనుగోలుకు ఈ–టెండర్ ప్రక్రియను చేపట్టాలని నిర్ణయించారు. ఈసారి గొర్రెల యూనిట్ వ్యయాన్ని ప్రభుత్వం పెంచిన విషయం విధితమే. రూ.1.25 లక్షలు ఉన్న యూనిట్ వ్యయాన్ని రూ.1.75 లక్షలకు పెంచింది. గొర్రెల ధరలు భారీగా పెరగడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. యూనిట్ వ్యయంలో 25 శాతం లబ్ధిదారులు తమ వాటా కింద చెల్లించాల్సి ఉంటుంది.
- ప్రభుత్వం ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకునేలా విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని నిర్ణయించారు. ఎంపీడీఓలు కూడా ఆరోగ్య మహిళా కేంద్రాలను సందర్శించి సేవల తీరును పర్యవేక్షించాలని కలెక్టర్ శరత్ ఇటీవల ఆదేశాలు జారీ చేశారు.

జీఓ. 58, 59 అమలుపై..

- ప్రభుత్వ స్థలాల ఆక్రమణల్లో ఉన్న వారి స్థలాలను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం జారీ చేసిన జీఓ నం.58, జీఓ నం.59 అమలు తీరుపై జిల్లా ఉన్నతాధికారులు నజర్ పెట్టారు. ఈ స్థలాల క్రమబద్ధీకరణకు ఈనెలాఖరు వరకు దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టారు.
- ఉపాధి హామీ పథకం అమలు తీరుపై దృష్టి సారించారు. గ్రామీణ ప్రాంతాల్లోని వ్యవసాయ కూలీలు ఎక్కువ సంఖ్యలో ఉపాధి హామీ పనులకు హాజరు అయ్యేలా చూడాలని క్షేత్ర స్థాయి సిబ్బందికి ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

ఎప్పటికప్పుడు పరిశీలన

సంక్షేమ పథకాల అమలు తీరుపై కలెక్టర్ డాక్టర్ శరత్ తరచూ సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఆయా పథకాల అమలును వేగవంతం చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితులను పరిశీలిస్తూ సంబంధిత శాఖల అధికారులకు ఎప్పటికప్పుడు ఆదేశాలు జారీ చేస్తున్నారు. ప్రధానంగా ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకాల అమలు తీరుపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించారు.

దుర్గమ్మకు పల్లకీ సేవ

పాపన్నపేట(మెదక్): పౌర్ణమిని పురస్కరించుకొని బుధవారం ఏడుపాయల్లో దుర్గమ్మకు పల్లకీ సేవ నిర్వహించారు. మొదట ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఉత్సవ విగ్రహాన్ని పల్లకీపై ఉంచారు. ఆలయ చైర్మన్ బాలాగౌడ్, ఈఓ సార శ్రీనివాస్, పాలకమండలి సభ్యులు, మహిళలు పల్లకీని మోశారు. ఆలయం ముందు నుంచి రాజగోపురం వరకు అమ్మవారి పల్లకీని ఊరేగించారు.



దుర్గమ్మ పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

బీఆర్‌ఎస్‌ను బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

కంది(సంగారెడ్డి): సీఎం కేసీఆర్ సారథ్యంలో ప్రజల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్న బీఆర్‌ఎస్‌ను బలోపేతం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం కందిలో మాజీ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా సీఎం కేసీఆర్ తెలంగాణలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ప్రజల అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. మరో 6, 7 నెలల్లో ఎన్నికలు జరిగే అవకాశం ఉందని, అందుకోసం నాయకులు నిత్యం ప్రజల్లో ఉండి తెలంగాణ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. మాజీ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడని, వచ్చే ఎన్నికల్లో ఆయనను భారీ మెజారిటీతో గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. బీఆర్‌ఎస్‌ను బద్నామ్ చేసేందుకు బీజేపీ నాయకులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణలో బీజేపీ ఆటలు సాగనివ్వబోమని తేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ బుచ్చిరెడ్డి, ఎంపీపీ సరళాపుల్లారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు కొండల్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సంస్థలను కాపాడుకుందాం

కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం

కొండాపూర్(సంగారెడ్డి): ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకుందామని, ఇదే బాబూ జగ్జీవన్ రామ్‌కు మనం ఇచ్చే నిజమైన నివాళి అని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం అన్నారు. జగ్జీవన్ రామ్ జయంతిని పురస్కరించుకొని బుధవారం సంగారెడ్డిలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాణిక్యం మాట్లాడుతూ కులవివక్షకు వ్యతిరేకంగా, సామాజిక న్యాయం కోసం పోరాడిన యోధుడు బాబూ జగ్జీవన్ రామ్ అన్నారు. మోదీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలైన రక్షణ, రైల్వే రంగాలను ప్రైవేటు వ్యక్తులకు అప్పనంగా అప్పగిస్తోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సహించడం అంటే దళితులు, అణగారిన వర్గాల హక్కులను కాలరాయడమే అన్నారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అశోక్, జిల్లా సహాయ కార్యదర్శి ప్రవీణ్, దాసు, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న నాయకులు

ఆదరణను చూసి ఓర్వలేకే కుట్రలు

నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

నర్సాపూర్: సీఎం కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజల్లో రోజురోజుకు బీఆర్‌ఎస్‌కు ఆదరణ పెరుగుతుందని, ఇది తట్టుకోలేకే ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేందుకు బీజేపీ నాయకులు కుట్ర చేస్తున్నారని నర్సాపూర్ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కుట్రలో భాగంగానే బండి సంజయ్ పదో తరగతి ప్రశ్నాపత్రం లీకు చేయించారని మండిపడ్డారు. లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడడం సరికాదని హితవు పలికారు. తమ రాజకీయ పబ్బం గడుపుకోవడానికి ఇలాంటి దారుణాలకు పాల్పడుతున్నారని వాపోయారు. ప్రతిపక్షాల కుట్రలను ప్రజలు గమనిస్తున్నారని.. రాబోయే ఎన్నికల్లో వారికి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మన్సూర్, ఎంపీపీ అధ్యక్షుడు నర్సింగ్‌రావు, ప్యాక్స్ చైర్మన్ రాజు యాదవ్, మండల పార్టీ అధ్యక్షుడు శేఖర్, పట్టణ అధ్యక్షుడు భిక్షపతి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అనర్హత వేటు వేయాల్సిందే..

పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి



పటాన్‌చెరు: ఇన్నేళ్లు మతతత్వం పేరుతో రాష్ట్రంలో అలజడులు సృష్టిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ నేడు ప్రశ్నాపత్రాల లీకేజీలు చేస్తూ అడ్డంగా దొరికిపోయాడని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. లోక్ సభ స్పీకర్ వెంటనే ఆయనపై అనర్హత వేటు వేయాలని డిమాండ్ చేశారు. రాజకీయ లబ్ధి కోసం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడటం సిగ్గుచేటు అన్నారు. కేసీఆర్‌ను ఎదుర్కొనే దమ్ము లేకనే బీజేపీ నేతలు ఇలాంటి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ దిగజారుడు చర్యలకు ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.



జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న జెడ్పీ చైర్ పర్సన్, కలెక్టర్ శరత్, తదితరులు

మహనీయుల చరిత్రను మరువొద్దు

జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ

సంగారెడ్డి టౌన్: మహనీయుల చరిత్రను ప్రతీ ఒక్కరు తెలుసుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ జైపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం బాబూ జగ్జీవన్ రామ్ జయంతిని పురస్కరించుకొని కలెక్టర్ శరత్, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్‌తో కలిసి పట్టణంలోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో అన్ని వర్గాల వారికి సమాన అవకాశాలు అందాలని, ఆ దిశగా డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ ఎంతో కృషి చేశారన్నారు. అనంతరం కలెక్టర్ డాక్టర్ శరత్ మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ గొప్ప ప్రజ్ఞాశాలి అని, అణగారిన వర్గాల గొంతుకని అన్నారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని, చైతన్యవంతమైన సమాజం కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. అప్పుడే బాబూ జగ్జీవన్ రామ్‌కు నిజమైన నివాళి అర్పించిన వారమవుతామన్నారు. అనంతరం ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ బాబూ జగ్జీవన్ రామ్ సేవలను గుర్తు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, టీఎస్ఎస్ కళాకారుల కళాజాత ఆకట్టుకున్నాయి. కులాంతర వివాహాలు చేసుకున్న జంటలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారి జగదీష్, డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, బీరయ్య యాదవ్, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ముగిసిన జోగినాథ రథోత్సవాలు

జోగిపేట(అందోల్): జోగిపేట శ్రీ జోగినాథ రథోత్సవాలు ముగిశాయి. గత నెల 26వ తేదీన ప్రారంభమైన ఉత్సవాలను బుధవారం అమ్మవారికి కుంకుమార్చన కార్యక్రమం వరకు ఘనంగా నిర్వహించారు. మంగళవారం అర్ధరాత్రి 12.30 గంటలకు హైస్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించిన లంకా దహనానికి పది వేలకు పైగా ప్రజలు హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. లంకాదహనం సందర్భంగా బాణసంచాల పేలుళ్లతో పట్టణమంతా దద్దరిల్లిపోయింది. నింగికెగిసిన తారాజువ్వలు ఆకట్టుకున్నాయి. కోనసీమ జిల్లాకు చెందిన రాజాబాబు ఆధ్వర్యంలో ప్రతి ఏడాది బాణసంచాలను ఏర్పాటు చేస్తారు. సర్పాలు, పూల చెట్ల ఆకృతిలో ఏర్పాటు చేసిన బాణా సంచాలు అలరించాయి. లంకా దహనం కార్యక్రమానికి హాజరైన ప్రముఖులకు రథోత్సవ కమిటీ తరఫున శాలువా, మెమోంటోతో ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే క్రాంతికిరణ్, బీజేవైఎం రాష్ట్ర నాయకుడు ఉదయ్ బాబూమోహన్, యూట్యూబ్ రాజుతో పాటు వ్యాపారస్తులు, కుల సంఘాల నాయకులు, కౌన్సిలర్లు, జర్నలిస్టులను సన్మానించారు. సీఐ నాగరాజు నేతృత్వంలో పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీకి చెందిన డాకూరి శంకర్, పి.శివశేఖర్, రంగ సురేశ్, డీబీ నాగభూషణం, డి.వెంకటేశం, సీహెచ్ వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.



బాణసంచా కాలుస్తున్న దృశ్యం

బండి సంజయ్‌ను విడుదల చేయాలి



సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నేతలు

బీజేపీ జిల్లా అధ్యక్షుడు నరేందర్ రెడ్డి

హత్నూర(సంగారెడ్డి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ని ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని, లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నరేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం హత్నూర మండలం దౌల్తాబాద్ తెలంగాణ తల్లి చౌరస్తాలో బీజేపీ మండల అధ్యక్షుడు నాగ ప్రభు గౌడ్ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం లీకేజీలు, ప్యాకేజీలతో పాటు లిక్కర్ దందాలు చేస్తూ ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను పూనుకుంటోందని, ఎక్కడికక్కడ ఎండగడుతున్న బండి సంజయ్ గొంతు నొక్కాలని చూస్తే ఊరుకునేది హెచ్చరించారు. ప్రజల పక్షాన బీజేపీ ఎప్పుడూ పోరాడుతుందని, అరెస్టులతో భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పదో తరగతి పరీక్షలను కూడా సమర్థవంతంగా నిర్వహించలేక అసమర్థ ప్రభుత్వంగా మారిందన్నారు. అనంతరం సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. పోలీసులు జోక్యం చేసుకొని రాస్తారోకోను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్, బీజేపీ నర్సాపూర్ నియోజకవర్గ కన్వీనర్ వాల్దాస్ మల్లేశం, జిల్లా కార్యదర్శి బైండ్ల కుమార్, ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి శంకర్, బీజేవైఎం నర్సాపూర్ కన్వీనర్ నిఖిల్ గౌడ్, నాయకులు శ్రీకాంత్, హన్మంత్, నవీన్, సతీశ్ యాదవ్, రవి, మల్లేశ్, ప్రవీణ్‌గౌడ్, ప్రభాకర్, కృష్ణ, బాలేశ్, రామచందర్, నాగరాజు, నర్సింలు పాల్గొన్నారు.

బండి సంజయ్ కనుసన్నల్లోనే పేపర్ లీకేజీ

అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

జోగిపేట(అందోల్): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కనుసన్నల్లోనే టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ జరిగిందని, ఆయనపై సిట్‌తో విచారణ జరిపించాలని అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ డిమాండ్ చేశారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పేపర్ల లీకేజీకి బీజేపీ ఆజ్యం పోస్తూ నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుతుందన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రాజకీయంగా ఎదుర్కోలేక ప్రభుత్వంపై, సీఎం కేసీఆర్‌పై తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను అశాంతికి గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దురుద్దేశంతో పదో తరగతి పరీక్ష పత్రాల లీకేజీకి తెరలేపిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్

ప్లాన్ ప్రకారమే కుట్ర

నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి


నారాయణఖేడ్: టీఎస్‌పీఎస్సీ, పదో తరగతి పేపర్ల లికేజీ కుట్ర బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌దేనని నారాయణఖేడ్ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీ పేపర్ల లికేజీలో ప్రధాన నిందితుడు రాజశేఖర్‌రెడ్డి బీజేపీ కార్యకర్తగా ఉంటూ సోషల్‌మీడియాలో పార్టీకి అనుకూలంగా ప్రచారం చేస్తుంటాడన్నారు. పదో తరగతి తెలుగు ప్రశ్నపత్రం లికేజీ చేసిన ఉపాధ్యాయుడికి క్రిమినల్ చరిత్ర ఉండగా, హిందీ ప్రశ్నాపత్రం లీక్ చేసిన ప్రశాంత్ బండిసంజయ్ అనుచరుడు, మాజీ పాత్రికేయుడన్నారు. ప్రశ్న పత్రం లీక్ చేయగానే కొద్ది సేపట్లోనే వాట్సాప్ గ్రూపుల్లో, టీవీల్లో వచ్చే విధంగా పతకం ప్రకారం కుట్ర పన్నారని ఆరోపించారు. రాజకీయ లబ్ధి కోసం నిరుద్యోగులు, విద్యార్థుల జీవితాలతో ఆడుకోవడం దారుణమన్నారు. ప్రతిపక్షాలు పన్నుతున్న కుట్రకు బలికావద్దని తల్లిదండ్రులను కోరారు.



విద్యార్థుల జీవితాలతో చెలగాటమా?

జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్: ప్రశ్నపత్రాల లీకేజీలో బీజేపీ నేతల హస్తం ఉందని ఎమ్మెల్యే మాణిక్‌రావు ఆరోపించారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ నేతలు విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారన్నారు. సీఎం కేసీఆర్‌ను ఎదుర్కోలేక ఇలాంటి దిగజారుడు పనులకు పాల్పడుతున్నారని, పేపర్ లీక్ చేసింది బీజేపీ కార్యకర్తలే అని తేలిందన్నారు. బీజేపీ తమ రాజకీయ ప్రయోజనాల కోసం ప్రభుత్వంపై కుట్ర పన్నడం తగదన్నారు. పేపర్ లీకేజీకి పాల్పడింది ప్రశాంత్ బీజేపీ కార్యకర్తగా తేలిందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని కూల్చేందుకే బీజేపీ కుట్ర పన్నుతోందని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్, నాయకులు విజయ్‌మోహన్‌రెడ్డి, జి.గుండప్ప, మంకాల్ సుభాష్, వైజ్యనాథ్, నర్సింహులు, సంజీవరెడ్డి, మొహియొద్దీన్, బండి మోహన్, బాబీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

క్లుప్తంగా

కలుషిత నీరు తాగిన గేదెలకు అస్వస్థత



గేదెకు గ్లూకోజ్ ఎక్కిస్తున్న దృశ్యం

పటాన్‌చెరు టౌన్: కలుషిత నీరుతాగిన పటాన్‌చెరు మండలం రామేశ్వరం బండ, అమీన్‌పూర్ మండలం సుల్తాన్‌పూర్, ఐలాపూర్‌కు చెందిన దాదాపు 35 బర్రెలు అస్వస్థతకు గురయ్యాడు. బుధవారం బర్రెల యజమానులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దవాగులో నీరు తాగిన బర్రెలు అస్వస్థతకు గురవడంతో వాటికి వైద్యం చేయిస్తునట్లు చెప్పారు.

కుక్కల దాడిలో 20 గొర్రెలు మృతి



మృతి చెందిన గొర్రెలు

నర్సాపూర్ రూరల్: ఊరు కుక్కల దాడిలో గొర్రెలు మృతి చెందాయి. ఈ సంఘటన నర్సాపూర్ మండలం తుల్జారాంపేట గిరిజన తండాలో బుధవారం వేకువ జామున జరిగింది. బాధితులు గొర్రెల యజమాని రాజు నాయక్, తండావాసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నునావత్ రాజు నాయక్ గొర్రెలను ఓ పాకలో ఉంచి పెంచుకుంటున్నాడు. పాక వద్దే ప్రతీరోజు కాపలా ఉంటాడు. బుధవారం వేకువ జామున ఇంటికి వచ్చాడు. ఆ సమయంలో గొర్రెల పాకపై ఊర కుక్కలు దాడిచేయడంతో 20 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. మరో 15 గొర్రెలు గాయపడ్డాయి. సుమారు రూ.1.50 లక్షల వరకు నష్టం జరిగిందని బాధితుడు రాజు ఆవేదన వ్యక్తం చేశాడు.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి

కొల్చారం(నర్సాపూర్): విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి చెందింది. ఈ సంఘటన బుధవారం మండల కేంద్రం కొల్చారం లో జరిగింది. బాధితురాలు చింతలగారి యాదమ్మ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వ్యవసాయ బోర్లకు కరెంటు సరఫరా చేసే విద్యుత్ తీగలు తెగి పడ్డాయి. గ్రామ శివారులోని పెరుమాండ్ల కుంటలో నీళ్లు తాగడానికి వెళ్లిన గేదె వాటిని తాకడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. సంఘటన స్థలాన్ని గిర్దావర్ శ్రీనివాస్, వెటర్నరీ అసిస్టెంట్ గట్టయ్య, విద్యుత్ అధికారులు సందర్శించి పంచనామా చేశారు. పాడిగేదె విలువ సుమారు రూ.40 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితురాలు యాదమ్మ విజ్ఞప్తి చేసింది.



గేదె కళేబరం

భేతాళస్వామి జాతరకు వేళాయె

- రాష్ట్రంలో మొదటి భేతాళ స్వామి ఆలయం
- జిల్లాలో ఏడుపాయల జాతర తర్వాత భేతాళ స్వామి జాతర
- పొరుగు రాష్ట్రాల నుంచి తరలిరానున్న భక్తులు
- ఏర్పాట్లుచేసిన జాతర నిర్వాహకులు



ఆలయంలో కొలువైన భేతాళ స్వామి



అల్లాదుర్గంలో భేతాళ స్వామి ఆలయం

అల్లాదుర్గం (మెదక్): భేతాళుడి కథలు చాలా ప్రాచుర్యంలో ఉన్నాయి. అలాంటి భేతాళస్వామి ఆలయం కూడా ఉండటం చాల అరుదు. గ్రామాల్లో వ్యాధులు ప్రబలి ప్రజలు మృత్యువాత పడటంతో భేతాళుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించాచారు. భక్తులు పూజలు చేయడంతో వ్యాధులు దూరం కావడం, కోరిన కోరికలు తీరడంతో వారి నమ్మకం రెట్టింపు అయ్యింది. ప్రజలకు అపార నమ్మకం కలగడంతో భేతాళుడికి జాతర నిర్వహించడం ఆనవాయితీగా మారింది.

➡ మెదక్ జిల్లాలో ఏడపాయల జాతర తర్వాత అల్లాదుర్గం భేతాళ స్వామి జాతర ఘనంగా జరుగుతుంది. ఈ జాతరకు చుట్టు పక్కల ప్రాంతాల వారే కాక కర్ణాటక, మహారాష్ట్రలతో పాటు జిల్లా నలు మూలల నుంచి ప్రజలు తరలివస్తారు.

➡ రాష్ట్రంలో ఎక్కడా లేని మొట్టమొదటి భేతాళ స్వామి దేవాలయం అల్లాదుర్గంలోనే ఉంది. ఈ ఆలయం నాలుగు వందల ఏళ్ల క్రితమే ఉన్నట్లు స్థానికులు చెబుతారు.

➡ ఈ స్వామివారి ఆలయానికి తలుపులు ఉండవు. క్షుద్రపూజలు చేసే కొందరు ఆలయాన్ని అపవిత్రం చేయడంతో ఆలయం చూట్టు ఇనుప చువ్వలతో కంచె ఏర్పాటు చేశారు.

➡ భేతాళుడికి మొక్కుకున్న భక్తులు బోనాలు, గండ జ్యోతితో ప్రదీక్షణలు చేస్తారు.

➡ అల్లాదుర్గంతో పాటు చూట్టు పక్కల గ్రామాలకు చెందిన వారు లెడ్ల బండ్లను అలంకరించి మేళతాళలతో ఆలయం చట్టూ తిప్పుతారు.

➡ భక్తులు బోనాలు, గండజ్యోతిని బండ్లను కట్టి ఆలయం చూట్టు ప్రదిక్షణలు చేస్తూ మొక్కులు తీర్చుకుంటారు. భక్తులు మొక్కులు తీర్చుకునేందుకు మేకలు, కోళ్ల స్వామికి సమర్పిస్తారు.

➡ భేతాళ స్వామిపై భక్తితో అల్లాదుర్గంతో పాటు చూట్టు పక్క గ్రామాలలోని ప్రజలు తమ పిల్లలకు భేతయ్య, భేతమ్మ పేర్లను ఎక్కువగా పెట్టుకుంటారు. అల్లాదుర్గంలో ఒకే కుటుంబంలో ఇద్దరు, ముగ్గురికి ఇవే పేర్లు ఉండటం విశేషం.

జాతర వివరాలు

భేతాళస్వామి జాతర వారం పాటు ఘనంగా జరుగుతుంది. వేలాదిమంది భక్తులు తరలివస్తారు. 7వ తేదీన పోలేరమ్మకు బోనాలు, 8న పోచమ్మకు బోనాలు సమర్పిస్తారు. 9వ తేదీన దుర్గమ్మకు, 10న భేతాళస్వామికి బోనాలు తీయడం జరుగుతుంది. 11న భేతాళస్వామి ఆలయం చుట్టూ ఎడ్ల బండ్లు తిరుగుతాయి. 12న భజనలు, 13న భాగవతములు, 14న వినోద కార్యక్రమాలు, 15న ఉదయం భేతాళస్వామి ఆలయం చుట్టూ పాచిబండ్లు తిరుగుతాయని ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఈర్ల అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. జాతరకు వచ్చే భక్తులకు వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోండి

- విద్యార్థిని కుటుంబానికి రూ.50 లక్షలు చెల్లించాలి
- టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ సంజీవరెడ్డి



మాట్లాడుతున్న డాక్టర్ సంజీవరెడ్డి

నారాయణఖేడ్: ఖేడ్‌లోని బాలికల గురుకుల కళాశాల ఘటనపై బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థిని కుటుంబానికి రూ.50 లక్షలు చెల్లించాలని టీపీసీసీ ఉపాధ్యక్షులు డాక్టర్ సంజీవరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం నారాయణఖేడ్‌లోని ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. విద్యార్థినిపై అఘాయిత్యం జరిగితే తొమ్మిది నెలలుగా కేర్‌టేకర్లు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ముళ్లపొదల్లో పసికందు దొరికినా పోలీసులు విచారణ ఎందుకు చేయలేదన్నారు. ఘటనను కప్పిపుచ్చడంలో అధికారపార్టీ నాయకులు హస్తం ఉందన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ కొరవడటంవల్లే గురుకులాల్లో అవాంఛనీయ సంఘటనలు జరుగుతున్నాయన్నారు. బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకుని విద్యార్థినిలతోపాటు తల్లిదండ్రులకు భరోసా కల్పించాలన్నారు. సిర్గాపూర్ గురుకులంలో ఓ విద్యార్థిని మూడునెలల క్రితం భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నా బాధ్యులపై చర్యలు లేవన్నారు. గురుకులం ఘటనపై తాను నాలుగురోజుల కిందటే జాతీయ బాలల కమిషన్‌కు మెయిల్ ద్వారా ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. సమావేశంలో డీసీసీ మాజీ కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు భోజిరెడ్డి, కౌన్సిలర్ దారం శంకర్, నాయకులు హన్మాండ్లు, యాదుల్ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల ముగ్గురి ఆత్మహత్య

వేర్వేరు చోట్ల ముగ్గురు బలవన్మరణానికి పాల్పడ్డారు. వరకట్న వేధింపులతో వివాహిత, ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి, స్థలం విషయంలో తండ్రితో గొడవపడిన కుమారుడు ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు కేసులు దర్యాప్తు చేస్తున్నారు.

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): వరకట్న వేధింపులు, కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య చేసుకుంది. బుధవారం సీఐ నవీన్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన నాగులపల్లి మల్లేశ్వరీ(20)కి అదే గ్రామానికి చెందిన సార మధుతో 16 నెలల క్రితం ప్రేమ వివాహమైంది. ఆరు నెలల పాటుగా వీరి సంసారం సాఫీగానే సాగింది. అనంతరం భర్త మధు, అత్త తరుచుగా వరకట్నం తీసుకురావాలని వేధించేవారు. దీంతో మానసిక వేదనకు గురైన మృతురాలు ఈనెల 4వ తేదీన ఇంట్లో ఎవరు లేని సమయంలో ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

పాపన్నపేట(మెదక్): ఆర్థిక ఇబ్బందులు, అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండల పరిధిలోని అర్కెల గ్రామంలో బుధవారం రాత్రి జరిగింది. మృతుడు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన చిట్యాల ఊశయ్య (55) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇతడికి నలుగురు కూతుళ్లు, కొడుకు ఉన్నారు. పంటల సాగుకు, కుటుంబ పోషణకు అప్పులు చేశాడు. అవి తీర్చే మార్గం కానరాక పొలం వద్ద ఆత్మహత్య కేసుకున్నాడు. ఎస్ఐ విజయ్‌ను వివరణ కోరగా తమకు ఇంకా ఫిర్యాదు అందలేదన్నారు.



శ్రీకాంత్ (ఫైల్)

చేర్యాల(సిద్దిపేట): తండ్రితో గొడవపడి మనస్తాపానికిగురై కొడుకు పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండల పరిధిలోని కొత్తదొమ్మాట గ్రామంలో బుధవారం జరిగింది. మృతుడి తండ్రి చెట్టి నర్సయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రెండు రోజుల క్రితం స్థలం కొనుగోలు విషయమై తండ్రి, పెద్ద కుమారుడు చెట్టి శ్రీకాంత్(25)కు మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన శ్రీకాంత్ మంగళవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. సాయంత్రం ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. రాత్రి ఇంటికి రాకపోవడంతో అనుమానం వచ్చి బంధువులు, మిత్రులను విచారించగా అతడి ఆచూకీ తెలియరాలేదు. బుధవారం గ్రామస్తుడు చింతల పర్శ రాములు ఆకునూరు రోడ్డులో పాలిటెక్నిక్ కళాశాల వెనుక గుర్తు తెలియని మృతదేహం పడిఉందని ఇచ్చిన సమాచారం ఇచ్చాడు. అక్కడికి వెళ్లి చూడగా శ్రీకాంత్‌గా గుర్తించారు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు విచారణ చేపట్టారు.

చికిత్స పొందుతున్న విద్యార్థి మృతి



శ్రీకర్‌రావు (ఫైల్)

మిరుదొడ్డి(దుబ్బాక): బైక్‌ను అడవి పంది ఢీకొట్టిన ఘటనలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ విద్యార్థి మృతిచెందాడు. ఈ ఘటన కాసులాబాద్‌లో బుధవారం చోటు చేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బొంపెల్లి శ్రీనివాసరావు కుమారుడు శ్రీకర్‌రావు (17) హైదరాబాద్‌లోని ఓ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల పరీక్షలు పూర్తి కావడంతో స్వగ్రామం వచ్చాడు. ఇంటి వద్దే ఉంటూ తండ్రితోపాటు పొలం పనులకు వెళ్తున్నాడు. పొలం పనులకు బైక్‌పై కాసులాబాద్ నుంచి దుబ్బాక మండలం హబ్సీపూర్ రోడ్డు గుండా వెళ్తున్నాడు. కాగా రోడ్డుకిరువైపులా దట్టమైన అడవి ఉండటంతో తరచూ అడవి పందులు రోడ్డు దాటుతుంటాయి. ఈ నేపథ్యంలో రోడ్డు గుండా వెళుతున్న శ్రీకర్‌రావు బైక్‌ను రోడ్డు దాటుతున్న అడవి పంది వేగంతో ఢీకొట్టడంతో అతడు కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు.

చెట్టును ఢీకొన్న బైక్

ఒకరు మృతి, మరొకరికి గాయాలు



బాబులాల్ మృతదేహం

పటాన్‌చెరు టౌన్: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా, మరో వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన భానూర్-బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బుధవారం ఎస్ఐ మహేశ్వర్ రెడ్డి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. బాబులాల్ (23), కల్లారం బతుకుదెరువు కోసం వచ్చి హైదరాబాద్ రాజేంద్రనగర్ పరిధిలోని శివరాంపల్లి గ్రామంలో నివాసం ఉంటున్నారు. కార్పెంటర్ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం బాబు లాల్, కల్లారం బైక్‌పై రామచంద్రపురం పరిధిలోని వెల్లమెల గ్రామ శివారులో హాల్ మార్క్ విల్లాస్‌లో పని కోసం వెళ్తుండగా మార్గంలోని వెల్లమెల శివారులో కుక్క అడ్డురావడంతో బైక్ అదుపు తప్పి విద్యుత స్తంభాన్ని ఢీ కొట్టింది. ఈ ఘటనలో తీవ్ర బాబూలాల్ తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం రామచంద్రపురం పరిధిలోని మెడికవర్ ఆస్పత్రికి తీసుకెళ్లగా పరిశీలించిన వైద్యులు బాబూలాల్ మృతి చెందినట్లు తెలిపారు. దీంతో సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. గాయపడ్డ కల్లారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కాపర్ వైర్లను తరలిస్తున్న వ్యక్తుల అరెస్ట్



కాపర్ వైరును తరలిస్తున్న వారిని అరెస్ట్ చేసిన పోలీసులు

జహీరాబాద్: కాపర్ వైర్లను తరలిస్తున్నవారిని అరెస్ట్ చేసినట్లు చిరాగ్‌పల్లి ఎస్ఐ కాశీనాథ్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. మొగుడంపల్లి మండలం గుడ్‌పల్లి గ్రామ అటవీ ప్రాంతంలో మంగళవారం అర్ధరాత్రి అనుమానిత ఎలక్ట్రిక్ వైర్లను కాల్చి కాపర్ వైర్లను తరలిస్తున్న మొగుడంపల్లికి చెందిన వజియొద్దీన్, ఎండి యూసూఫ్, ఆసిఫ్‌ను అరెస్ట్ చేశారు. అక్రమంగా అటవీ ప్రాంతంలోకి ప్రవేశించి, మానవ మనుగడకు హాని కలిగించే విధంగా వాతావరణాన్ని కలుషితం చేస్తున్నందుకు అదుపులోకి తీసుకున్నారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ సంజీవ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిరాగ్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురి అదృశ్యం



ప్రభాకర్(ఫైల్)

పటాన్‌చెరు టౌన్: చెత్త కాగితాల సేకరణకు వెళ్లి ఇద్దరు మైనర్ బాలికలు అదృశ్యయ్యారు. ఈ సంఘటన బుధవారం పటాన్‌చెరు పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం నుంచి గత ఏడాది బతుకుదెరువు కోసం వచ్చిన వారు పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామ శివారులో గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నారు. చెత్త కాగితాలు సేకరిస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో 3వ తేదీన కాగితాలు సేకరించేందుకు ఇద్దరు బాలికలు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు తెలిసిన వారిని విచారించినా వారి ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వర్గల్(గజ్వేల్): షార్ట్ ఫిల్మ్ షూటింగ్ కోసం వెళ్లిన యువకుడి జాడ తెలియరాలేదు. ఈ సంఘటన వర్గల్ మండలం అనంతగిరిపల్లిలో బుధవారం వెలుగులోకి వచ్చింది. గౌరారం ఎస్ఐ సంపత్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అనంతగిరిపల్లికి చెందిన వొంకి ప్రభాకర్(27) కొద్దిరోజులుగా షార్ట్‌ఫిల్మ్ షూటింగులు చేస్తున్నాడు. అదేవిధంగా సోమవారం షూటింగ్‌కు వెళుతున్నట్లు భార్యకు చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. ఆ తరువాత తిరిగిరాలేదు. అతడి ఫోన్ స్విచ్‌ఆఫ్‌లో ఉంది. బంధువులను, తెలిసినవారిని విచారించినా అతడి ఆచూకీ దొరకలేదు. దీంతో అతడి భార్య రజని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ఐదుగురి అరెస్ట్



పోలీసులు సీజ్ చేసిన సెల్ ఫోన్లు, నగదు

దుబ్బాకరూరల్: పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఐదుగురిని అరెస్ట్ చేశారు. ఈ ఘటన బుధవారం జరిగింది. ఎస్ఐ మహేందర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్‌కు చెందిన ఏడుగురు వ్యక్తులు రాజక్కపేట నుంచి మల్లన్నగుట్టకు వెళ్లే దారిలో పేకాట ఆడుతున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీస్‌లు పేకాట స్థావరంపై దాడి చేసి ఐదుగురు పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకోగా, మరో ఇద్దరు పరారయ్యారు. పట్టుబడిన వారి నుంచి రూ.13,550 నగదు, ఐదు ద్విచక్ర వాహనాలు, ఐదు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

తూప్రాన్: రైలు పట్టాలపై గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్లు కామారెడ్డి రైల్వే పోలీసులు బుధవారం తెలిపారు. మనోహరాబాద్-మాసాయిపేట్ రైల్వే స్టేషన్‌ల మధ్య 568 నంబర్ వద్ద సుమారు 45 నుంచి 50 సంవత్సరాల మధ్య వయస్సు గల మహిళ మృతదేహం పడి ఉంది. మృతురాలు ఎరుపు, పచ్చ, గులాబి రంగుల చీర, ఎరుపు రంగు జాకెట్ ధరించింది. వివరాలు తెలిసినవారు కామారెడ్డి పోలీసులకు సమాచారమివ్వాలని ఎస్ఐ తావునాయక్ సూచించారు. వివరాలు 94400700034, 9703217723 నంబర్‌లకు తెలపాలన్నారు.

ఫోన్‌తో అపరిచితుడి పరారీ

పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

పటాన్‌చెరు టౌన్: ఫోన్ మాట్లాడి ఇస్తానని అపరిచితుడు ఫోన్‌తో ఉడాయించి సంఘటన పటాన్‌చెరు పట్టణంలో చోటుచేసుకుంది. బుధవారం బాధితుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అందోల్‌కు చెందిన రాంరెడ్డి హైదరాబాద్‌లోని ఆస్పత్రికి వెళ్లేందుకు తన ఆటోలో బయలు దేరాడు. ఈ క్రమంలో పటాన్‌చెరు సాకి చెరువు సమీపంలో ఆగి ఉండగా, ఓ వ్యక్తి రాంరెడ్డి వద్దకు వచ్చి అర్జెంట్‌గా ఓ ఫోన్ కాల్ చేసుకోవాలని బ్రతిమిలాడి ఫోన్ తీసుకున్నాడు. ఫోన్ మాట్లాడిన అనంతరం డయల్ చేసిన నంబర్‌ను డిలిట్ చేసి ఇస్తానని చెప్పి ఫోన్‌తో పరారయ్యాడు. దీంతో బాధితుడు వెంటనే పటాన్‌చెరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

బెల్ట్ షాపులపై దాడులు

నలుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

పటాన్‌చెరు టౌన్: ఎక్సైజ్ పోలీసులు బెల్ట్‌షాపులపై దాడులు నిర్వహించి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటన పటాన్‌చెరు ఎక్సైజ్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఎక్సైజ్ సీఐ సీతారామిరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు మండలం కర్దనూర్ గ్రామంలో బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం రావడంతో ఎస్ఐ శ్రీనివాస్, సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని, నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ మాట్లాడుతూ పటాన్‌చెరు ఎక్సైజ్ పోలీసు స్టేషన్ పరిధిలో బెల్ట్ షాపులు నిర్వహించేవారి సమాచారం తెలపాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

రెండు షాపుల్లో చోరీ

సీసీ ఫుటేజీలో దొంగతనం దృశ్యాలు నమోదు

పటాన్‌చెరు టౌన్: రెండు షాపుల్లో గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బుధవారం బాధితుడు నరేశ్, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు మండలం బచ్చుగూడెం చౌరస్తా సమీపంలో తెల్లవారుజామున గుర్తు తెలియని ముగ్గురు దొంగలు ప్లయివుడ్ షాపులో రూ.80 వేల నగదు, పక్కనే ఉన్న సిమెంట్ షాపులో ఉన్న రూ.7 వేల నగదు దోచుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. చోరీ దృశ్యాలు సీసీ ఫుటేజ్‌లో నమోదయ్యాయి. దొంగతనానికి పాల్పడిన వ్యక్తులు ఇతర రాష్ట్రాల వారై ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు.



సీసీ ఫుటేజీలో దొంగల కదలికలు

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



గుర్తు తెలియని మృతదేహం

సంగారెడ్డి మున్సిపాలిటీ: చౌటకూర్ మండలం శివంపేట గ్రామ శివారు సర్వీసు రోడ్డు ఫ్లయిఓవర్ వద్ద మంగళవారం రాత్రి గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. బుధవారం పుల్కల్ ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శివంపేట శివారులోని ఫ్లయిఓవర్ వద్ద వ్యక్తి పడి ఉండగా గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు సంఘటన చేరుకునేలోగా చనిపోయి ఉన్నాడు. స్థానికుల సహాయంతో ప్రైవేట్ అంబులెన్స్‌లో శవపంచనామా కోసం సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడు వయస్సు 50 నుంచి 55 సంవత్సరాల మధ్య ఉంటుందని భావిస్తున్నారు. మృతుడు తెలుపు రంగు షర్టు, నలుపు రంగు గీతల ప్యాంటు ధరించాడు. వివరాలకు జోగిపేట సీఐ ఫోన్ నంబర్ 87126 56723, పుల్కల్ ఎస్ఐ 87126 56754 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

హిందువులు ఐకమత్యంగా ఉండాలి

వీహెచ్‌పీ రాష్ట్ర కార్యదర్శి పండరినాథ్



చిన్నశంకరంపేటలో మాట్లాడుతున్న వీహెచ్‌పీ రాష్ట్ర కార్యదర్శి పండరినాథ్

చిన్నశంకరంపేట(మెదక్): హనుమాన్ సేవలో పాల్గొనడం గొప్ప అనుభూతిని పొందడంతో పాటు హనుమాన్ నామస్మరణ మానవులకు ఎంతో శక్తిని ఇస్తుందని వీహెచ్‌పీ రాష్ట్ర కార్యదర్శి పండరినాథ్ అన్నారు. బుధవారం చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని శ్రీఅభయ ఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహించారు. స్వామివారికి చందనోత్సవం, అభిషేకం చేశారు. అనంతరం హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా పండరినాథ్ మాట్లాడుతూ చిన్నశంకరంపేటలో హనుమాన్ శోభయాత్ర నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో చిన్నశంకరంపేట సర్పంచ్ రాజిరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, మండల అధ్యక్షుడు పోగుల రాజు, కాంగ్రెస్ జిల్లా నాయకులు ఆవుల గోపాల్‌రెడ్డి, హనుమాన్ ఆలయ కమిటీ అధ్యక్షుడు వెంకట్రాములు, కమిటీ సభ్యుడు వనం నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

భర్త ఇంటి ఎదుట భార్య ధర్నా

అదనపు కట్నం తేవాలంటూ వేధిస్తున్నాడని ఆరోపణ

మద్దూరు(హుస్నాబాద్): అదనపు కట్నం కావలంటూ కాపురానికి తీసుకెళ్లకుండా వేధిస్తున్న భర్త ఇంటి ఎదుట భార్య ధర్నాకు దిగిన ఘటన మండలంలోని నర్సయపల్లి గ్రామంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. నర్సయపల్లి గ్రామానికి చెందిన బద్దిపడిగె శ్రీనివాస్‌రెడ్డికి 2019లో అంజలితో వివాహమైంది. అప్పటి నుంచి అదనంగా డబ్బులు తేవాలంటూ ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. భర్త వేధింపులు తాళలేక సిద్దిపేట వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కౌన్సెలింగ్ ఇచ్చారని, అయినా మార్పు రాలేదు. డబ్బులు ఇవ్వాలని, లేదంటే విడాకులు ఇస్తానంటూ బెదిరిస్తున్నాడని, తనకు న్యాయం జరిగే వరకు ధర్నా చేస్తానని బాధితురాలు తెలిపింది.



మహిళా సంఘాలతో కలిసి ధర్నా చేస్తున్న బాధితురాలు